క్లుప్తంగా

మెనూ అమలులో రాజీ పడొద్దు

పగిడ్యాల: రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న జగనన్న గోరు ముద్ద మెనూ విషయంలో రాజీ పడొద్దని ఎంఈఓ సుభాన్ హెచ్ఎంలను ఆదేశించారు. మంగళవారం మండల పరిధిలోని పాత, కొత్త ముచ్చుమర్రి, కొత్త ఎల్లాల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు.

లాకీన్సలా వద్దకు 350 క్యూసెక్కుల నీరు

పాములపాడు: మండలంలోని కేసీ కెనాల్ 120వ కిలోమీటరు లాకీన్సలా వద్దకు 350 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుందని ఏఈ శ్రీనివాసనాయక్ మంగళవారం తెలిపారు. ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి ఒక పంపు, మల్యాల ఎత్తిపోతల పథకం నుంచి రెండు పంపుల ద్వారా కేసీ కెనాల్‌లోకి నీరు విడుదల అవుతోందన్నారు. లాకీన్సలా నుంచి 300 క్యూసెక్కులు తూడిచెర్ల సబ్‌ఛానల్, 50 క్యూసెక్కులు అలగనూరు రిజర్వాయర్‌కు విడుదల చేస్తున్నట్లు వివరించారు.

దేవాలయాల అభివృద్ధికి కృషి


కొత్తబోరును ప్రారంభించిన ఎస్ఐ, వైస్ ఎంపీపీ

కొత్తపల్లి: దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని వైస్ ఎంపీపీ సింగారం వెంకటరమణ(రంగ)అన్నారు. సోమవారం మండలంలోని నాగంపల్లి గ్రామంలోని శివాలయంలో ఎస్ఐ హుస్సేన్‌బాషాతో కలసి నూతన బోరును ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ దేవాలయంలో భక్తుల సౌకర్యార్థం ప్రభుత్వం బోరును ఏర్పాటు చేసిందన్నారు. దీనికి శాప్‌చైర్మన్, వైఎస్సార్‌సీపీ యుజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి తన సొంత ఖర్చులతో బోరు మోటరు, స్టాటరు ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బుజ్జిరెడ్డి, నాగరాజు, బంగారు వెంకటేశ్వర్లు, రాజు, అంజి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో ఉన్నతంగా రాణించాలి


క్రీడాకారులకు మ్యాట్‌లను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నందికొట్కూరు రూరల్ : దామగట్ల గ్రామంలోని క్రీడాకారులు క్రీడల్లో ఉన్నతంగా రాణించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని వైఎస్సార్‌సీపీ నాయకులు దాలు చంద్రశేఖర్ అన్నారు. శాప్ మాజీ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, యువనాయకులు చంద్రమౌళి సహకారంతో గ్రామంలోని కబడ్డీ క్రీడాకారులకు సోమవారం కబడ్డీ మ్యాట్‌లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలోని యువతకు అన్ని వేళల సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సుశీలమ్మ, రవికుమార్, పీడీ నాగన్న తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి అవార్డు


అవార్డు అందుకున్న రామారావు

ఆత్మకూరు: పట్టణంలోని ప్రగతిహైస్కూల్‌లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు రామారావు సౌత్ ఇండియా ఐకానిక్ టీచర్ అవార్డు 2020–23కు ఎంపిక య్యారు. మంగళవారం గుంటూరు పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన అవార్డును అందుకున్నారు. అవార్డు లభించడంపై పట్టణంలో పలువురు ఉపాధ్యాయులుఅభినందనలు తెలియజేశారు.

హైవే 340సీ పనులు ప్రారంభం


జేసీబీతో చదును చేస్తున్న దృశ్యం

జూపాడుబంగ్లా: మండల పరిధిలోని తర్తూరు అంచవద్ద నుంచి నేషనల్ హైవే 340సీ రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభం అయ్యాయి. నేషనల్ హైవే అథార్టీ అధికారులు ఇచ్చిన మార్కింగ్ ప్రకారంగా జేసీబీ, డోజర్‌తో మార్కింగ్ ప్రకారంగా రోడ్డు రూపకల్పన పనులు చేస్తున్నారు. పంటపొలాలు లేని చోట కంపచెట్లను తొలగించి రోడ్డు రూపురేఖలను తయారు చేస్తున్నారు. పొలాల్లో పంట నూర్పిడి పూర్తయిన వెంటనే రోడ్డు నిర్మాణం పనులను వేగవంతం చేయనున్నట్లు నేషనల్ హైవే అధికారులు వెల్లడించారు.

రేపు హుండీ ఆదాయం లెక్కింపు

కొత్తపల్లి: మండలంలోని కొలనుభారతి దేవి ఆలయంలో గురువారం శాశ్వత హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి మోహన్ మంగళవారం తెలిపారు. 6 నెలల హుండీ కానుకలను లెక్కించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు లెక్కింపులో పాల్గొనవచ్చన్నారు.






హంద్రీ – నీవా ద్వారా ఉమ్మడి జిల్లాలోని 77 చెరువులకు నీటిని అందించే పథకాన్ని ప్రారంభించేందుకు మంగళవారం జిల్లాకు విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి స్థానిక అధికారులు, ప్రజా ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. ఉదయం ఓర్వకల్లు ఎయిర్‌పోర్టుకు చేరుకున్న సీఎంకు శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్, శాప్ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి, నంద్యాల జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ వంగాల భరత్‌కుమార్‌రెడ్డి పుష్ప గుచ్ఛం అందించి స్వాగతం పలుకుతున్న దృశ్యం.

ఆరోగ్య సమస్యలను తెలుసుకునేందుకే సర్వే

వెలుగోడు : ప్రతి ఇంట్లో కుటుంబీకుల ఆరోగ్య సమస్యలను తెలుసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా 'జగనన్న ఆరోగ్య సురక్ష' సర్వే చేపడుతోందని జిల్లా ప్రోగ్రాం అధికారి కాంతారామ్ నాయక్ తెలిపారు. వేల్పనూరు పీహెచ్‌సీ పరిధిలోని అబ్దుల్లాపురం గ్రామంలో మంగళవారం ఇంటింటి సర్వే చేపట్టారు. వేల్పనూరు ప్రైమరీ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ కాంతారామ్ నాయక్ సర్వేను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్య కేంద్రం పరిధిలో ఏఎన్ఎంలు, వలంటీర్లు ఇంటింటికీ తిరిగి సర్వే చేస్తారన్నారు. ఆరోగ్య సమస్యలున్న వారిని గుర్తించి టోకెన్ ఇచ్చి వారికి వచ్చేనెల వైద్యశిబిరంలో నిపుణులతో ఆరోగ్య పరీక్షలు చేయించి మందులు ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ వంశీకృష్ణ, ఎంపీహెచ్ఈవో శ్రీనివాసులు, ఏఎన్ఎం సునీత, ఎంఎల్‌హెచ్‌పీ వసంత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక


నియోజకవర్గం స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం, సిబ్బంది

పాములపాడు: గ్రామీణ స్థాయి నుంచి ప్రతిభ గల క్రీడాకారులను వెలికి తీసేందుకు ప్రభుత్వం నిర్వహించిన ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో మండలంలోని వేంపెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. మంగళవారం హెచ్ఎం కృష్ణమూర్తి విద్యార్థులను అభినందించారు. ఆయన మాట్లాడుతూఈ నెల 13, 14 తేదీల్లో మండల కేంద్రంలో నిర్వహించిన మండల స్థాయి పోటీల్లో తమ పాఠశాలకు చెందిన 25 మంది విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి నియోజకవర్గ స్థాయికి ఎంపికయ్యారన్నారు. పీఈటీ నాగరాజును ప్రత్యేకంగా అభినందించారు.

రేపటి నుంచి నియోజకవర్గ స్థాయి క్రీడాపోటీలు

ఆత్మకూరు : పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ఈ నెల 21 నుంచి నిర్వహిస్తున్న శ్రీశైలం నియోజకవర్గ స్థాయి స్కూల్ క్రీడాపోటీలను విజయవంతం చేయాలని పీఈటీ దేవానంద్ మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 21న అండర్ 14 విభాగంలో బాలబాలికల ఎంపిక, 22న అండర్ –17 విభాగంలో బాలబాలికల క్రీడాపోటీల ఎంపిక నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ పోటీలలో నియోజకవర్గంలోని వివిధ పాఠశాలలకు చెందిన క్రీడాకారులు హాజరవుతారని చెప్పారు.

నేడు నియోజకవర్గ స్థాయి ఎంపిక పోటీలు

నందికొట్కూరు: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బుధవారం నియోజకవర్గ స్కూల్ గేమ్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ స్కూల్ గేమ్స్ కో ఆర్డినేటర్ దోరతి తెలిపారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. బుధవారం ఉదయం 10 గంటలకు క్రీడా మైదానంలో పోటీలు ప్రారంభిస్తునట్లు తెలిపారు. స్కూల్ గేమ్స్ నియోజకవర్గ స్థాయి అండర్–14, అండర్–17లో ప్రతిభ చాటిన క్రీడాకారులను సెలక్ట్ చేస్తాన్నారు.

జూపాడుబంగ్లా ఎస్ఐగా మారుతిశంకర్


మారుతిశంకర్

జూపాడుబంగ్లా: స్థానిక పోలీసుస్టేషన్ నూతన ఎస్ఐగా మారుతిశంకర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. మిడుతూరు ఎస్ఐగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయన బదిలీల్లో భాగంగా ఇక్కడికి వచ్చారు. జూపాడుబంగ్లా ఎస్ఐ వెంకటసుబ్బయ్య నందికొట్కూరు పట్టణ ఎస్ఐగా బదిలీఅయ్యారు. ఎస్ఐ మారుతిశంకర్ విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజలు ఎలాంటి తగాదాలు, అల్లర్లకు పాల్పడకుండా ప్రశాంతజీవనాన్ని అలవర్చుకోవాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా ప్రజలు ప్రశాంతంగా వినాయచవితి వేడుకలను నిర్వహించుకోవాలని సూచించారు.

మహిళ ఆత్మహత్య

మిడుతూరు: మండలపరిధిలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన ఓ మహిళ ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఏఎస్ఐ తెలిపిన వివరాల మేరకు తిమ్మాపురం గ్రామానికి చెందిన నల్లమల సురేష్, పారుమంచాల గ్రామానికి చెందిన స్వర్ణలత(35)తో 13 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ముగ్గురు సంతానం. దోర్నాల మండలం కుంట గ్రామంలో ఎద్దులు పెట్టుకొని భర్త సురేష్ వ్యవసాయం చేసుకుంటూ జీవనం గడుపుతున్నాడు. భార్య స్వర్ణలత, తల్లి లూషమ్మ, ముగ్గురు పిల్లలతో కూలీపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో స్వర్ణలత ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఇంటికి వచ్చిన తల్లి లూషమ్మ గమనించి, ఇరుగుపొరుగు వారిని పిలిచింది. అప్పటికే కూతురు మృతిచెందింది. విషయం లుసుకున్న ఏఎస్ఐ ఘటనా స్థలానికి చేరుకొని ఆత్మహత్యకు గల కారణాలపై ఆరా తీశారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

శ్రీశైల క్షేత్రం అన్ని విధాల అభివృద్ధి


గణేష్‌సదనం వసతి సముదాయాన్ని రిబ్బన్‌కట్ చేసి ప్రారంభిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే

- డిప్యూటీ సీఎం, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ
- గణేశసదనం ప్రారంభం
- క్షేత్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శిలాఫలకాల ఆవిష్కరణ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారని డిప్యూటీ సీఎం, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. మంగళవారం స్వామిఅమ్మవార్లను దర్శించుకున్న అనంతరం శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో రూ.50.80కోట్లతో నిర్మించిన 224 గదుల గణేశ సదనం వసతి సముదాయాన్ని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం విభూతిమఠం, ఘంటామఠం, రుద్రాక్ష మఠం శిలాఫలకాలను ఆవిష్కరించారు. అలాగే రూ.5.50కోట్లతో క్షేత్ర అటవీ సరిహద్దు కంచె నిర్మాణానికి, ఆలయ పశ్చిమ మాఢవీధి సుందరీకరణ, రూ.1.60కోట్లతో నక్షత్రవనం, రూ.2.32కోట్లతో దేవస్థాన ఈఓ వసతి భవనాల నిర్మాణ పనుల శిలాఫలకాలను ఆవిష్కరించారు. అనంతరం మొదటిగా మంత్రి, ఎమ్మెల్యే స్వయంగా డబ్బు వెచ్చించి గదిని తమ పేరుతో బుక్ చేసుకున్నారు. అలాగే పలు అభివృద్ధి కార్యక్రమాల ఫోటోగ్యాలరీని తిలకించారు. వసతి సముదాయం వద్ద ఏర్పాటు చేసిన వేదికపై శ్రీశైలక్షేత్రవైభవం పుస్తకావిష్కరణ చేసి మొదటి ప్రతిని ఎమ్మెల్యే శిల్పాకు మంత్రి అందజేశారు. ఈఓ లవన్న శ్రీశైలక్షేత్రంపై రచించిన పుస్తకాన్ని మంత్రి ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ మరో రెండేళ్లలో శ్రీశైలం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. గతంలో శ్రీశైల ఆలయానికి గోపురాన్ని, సాలు మండపాలు శ్రీకృష్ణదేవరాయలు నిర్మించారని, భక్తుల సౌకర్యార్థం ప్రస్తుతం రూ.75కోట్లతో నూతన క్యూకాంప్లెక్స్, రూ.40 కోట్లతో సాలు మండపాలు నిర్మించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో దేవస్థాన ధర్మకర్తల మండలి సభ్యులు మేరాజోత్ హనుమంత్ నాయక్, ఎం.విజయలక్ష్మి, మఠం విరూపాక్షయ్యస్వామి, తన్నీరు ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

చట్టం ఎవరికీ చుట్టం కాదు

చట్టం ఎవరికి చుట్టం కాదని, పూర్తి సాక్షాధారాలతో దొరికిన తరువాత ఎవరూ తప్పించుకోజాలరని డిప్యూటీ సీఎం, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. మంగళవారం రాత్రి శ్రీశైలంలో మంత్రి మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు పెద్ద పెద్ద లాయర్లను తీసుకువచ్చిన చేసిన తప్పు దాగదన్నారు. చేసిన తప్పులన్నీ బయటికి వస్తాయని, ఎన్ని లక్షల కోట్లు దోచుకున్నాడొ అన్ని బయటికి వస్తాయని చెప్పారు. చంద్రబాబు అరెస్ట్‌పై ప్రజలు ఎవరు బాధపడటం లేదని, ఇంకా న్యాయవ్యవస్థలపై విశ్వాసం పెరిగిందని తెలిపారు. 2014లో అధికారంలోకి వచ్చిన మూడు నెలలకే ఈ స్కామ్‌కి రూపకల్పన చేశారని, ఎంత అవినీతి చేద్దామని వచ్చాడోఅని ప్రజలకు అర్థమైందని అన్నారు. జనసేనకు ఒంటరిగా ఎన్నికలకు వెళ్లే సత్తాలేదని, వారికి 20మంది అభ్యర్థులు కూడా లేరన్నారు.

నిమజ్జన మహోత్సవానికి ఎమ్మెల్యేకు ఆహ్వానం


ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డిని సత్కరిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

ఆత్మకూరు: పట్టణంలో బుధవారం జరుగుతున్న వినాయక నిమజ్జన కార్యక్రమానికి ముఖ్యఅతిథుగా హాజరుకావాలని ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డిని, సీనియర్ నాయకులు శిల్పా భువనేశ్వరరెడ్డిలను ఆత్మకూరు ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు గణేష్, పువ్వాడ భాస్కర్ ఆహ్వానించారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం వారిని కలిసి నిమజ్జన మహోత్సవ పత్రికను అందజేశారు.

నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించండి

పట్టణంలో బుధవారం గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా నిర్వహించాలని ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి అన్నారు. మంగళవారం ఉదయం గణేష్ నిమజ్జనం వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయం నుంచి ప్రారంభమవుతుందని, అనంతరం పట్టణలోని పురవీధుల గుండా నిమజ్జనం ఎర్రగూడూరు గ్రామ సమీపంలోని ఎస్ఆర్ఎన్సీ కాలువ లో గణేష్ నిమజ్జన కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు.

శ్రీశైలంలో పోలీసుల పేకాట

శ్రీశైలం: శ్రీశైలక్షేత్రంలో బందోబస్తు నిర్వహణకై డిప్యుటేషన్ పద్ధతిన నియోజకవర్గంలోని వివిధ పోలీస్ స్టేషన్ల నుంచి వచ్చిన పోలీసులు తమకు కేటాయించిన భ్రామరీ సదన్‌లోని విశ్రాంతి భవనంలో పేకాట ఆడటం చర్చనీయాంశంగా మారింది. క్షేత్రపరిధిలోనికి మద్యం తీసుకురావడం, జూదం ఆడటం, మాంసాహారాన్ని తీసుకురావడం దేవదాయచట్టం ప్రకారం నేరం . వాటిని నిరోధించాల్సిన పోలీసులే విశ్రాంతి భవనంలో పేకాట ఆడటంతో కొందరు వీడియో తీసి మీడియాకు చేరవేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఈ విషయంపై వన్‌టౌన్ ఎస్ఐ లక్ష్మణరావును సంప్రదించగా జరిగిన సంఘటనపై ఆరా తీస్తున్నామన్నారు. పేకాట ఆడుతున్న వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు.

డెంగీ జ్వరాలపై అవగాహన

ఆత్మకూరు: మండలంలోని బైర్లూటి గిరిజన సంక్షేమ పాఠశాల, వెంకటాపురం ఎస్సీ వసతిగృహంలోని విద్యార్థులకు మంగళవారం బైర్లూటి వైద్య సిబ్బంది డెంగీ జ్వరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. బైర్లూటి వైద్యాధికారి పవన్‌కుమార్ మాట్లాడుతూ వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. అనంతరం విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది బాషా, వార్డెన్లు అంకన్న, శ్రీరాములు పాల్గొన్నారు.

ఉండ్రాలయ్యా..దీవించయ్యా!


నెహ్రూనగర్ వినాయక చవితి పూజల్లో పాల్గొన్న భక్తులు


శ్రీశైలం దేవస్థానం ఉద్యోగుల న్యూ స్టాఫ్ క్వార్టర్స్ వద్ద పూజలు నిర్వహిస్తున్న అర్చకులు


వెలుగోడులో కొలువుదీరిన గణనాథుడు

నందికొట్కూరు: శ్రీశైలం, నందికొట్కూరు నియోజకవర్గాల్లో వినాయ చవితి వేడుకలను భక్తులు వైభవంగా జరుపుకున్నారు. పండుగతో పట్టణ, గ్రామీణ ప్రాంతా ల్లో సందడిగా మారింది. ఊరూరా, వాడవాడలా విగ్రహాలను ప్రతిష్ఠించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. యువత విఘ్నేషునికి అన్న ప్రసాదాలు, నైవేద్యాలతో పూజలు చేస్తూ, భక్తులకు తీర్థప్రసాదాలను పంచుతున్నారు. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు చేపడుతున్నారు. నందికొట్కూరు పోలీసు స్టేషన్ పరిధిలో–50 విగ్రహాలను ఏర్పాటు చేశారు. రామాలయం వీధిలోని వినాయక విగ్రహానికి మున్సిపల్ దాసి సుధాకర్‌రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కొత్తపల్లి : మండలంలో 40 విగ్రహాలు ఏర్పాటు చేయగా బుధవారం నిమజ్జనంనిర్వహించనున్నారు.

పాములపాడు/జూపాడుబంగ్లా: పాములపాడు మండలంలో 64, జూపాడుబంగ్లా మండలంలో 45 విగ్రహాలు ప్రతిష్ఠించినట్లు పోలీసులు తెలిపారు.

నందికొట్కూరు రూరల్: మండల పరిధిలోని కొణిదేల, బొల్లవరం, అల్లూరు తదితర గ్రామాలలో యువకులు, గ్రామస్తులు గణనాథుడి విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పగిడ్యాల: మండల వ్యాప్తంగా దాదాపు 100 విగ్రహా లను భక్తులు ఏర్పాటు చేశారు. బుధవారం కేసీ కాలువలో నిమజ్జనం చేయనుండగా వేడుకలను భక్తులు ప్రశాంతంగా, నిర్ణీత సమయంలోనే నిమజ్జనం చేయా లని ముచ్చుమర్రి ఎస్ఐ నాగార్జున సూచించారు.

మిడుతూరు: మండల కేంద్రమైన మిడుతూరుతో పాటు పీరుసాహెబ్‌పేట, రోళ్లపాడు, తలముడిపి, దేవనూరు, చింతలపల్లి, సుంకేసుల, వీపనగండ్ల, చెరుకుచెర్ల తదితర గ్రామాల్లో కొలువుదీరిన గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.


నందికొట్కూరులో వినాయకుడి పూజలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి

పురవీధుల్లో కొలువుదీరిన గణనాథులు

ఆత్మకూరు: వినాయక చవితి పర్వదినం సందర్భంగా పట్టణంలోని పలు దేవాలయాల్లో, పురవీధుల్లో సోమ వారం గణనాథులు కొలువుతీరారు. పట్టణంలో, మండలంలో దాదాప 40 కి పైగా విగ్రహాలను ఏర్పాటు చేశారు. బుధవారం ఆత్మకూరు డివిజన్ పరిధిలోని ఆత్మకూరు, వెలుగోడు, కొత్తపల్లి, పాములపాడు మండలాల్లో కొలువుతీరిన గణనాథులను సమీపంలో ఎస్సార్‌బీసీ కెనాల్ వద్ద, వివిధ గ్రామాల సమీపంలోని నదుల వద్ద నిమజ్జనం చేయనున్నట్లు ఎస్సై కృష్ణమూర్తి యాదవ్ తెలిపారు.

శ్రీశైలం: శ్రీశైలమహాక్షేత్రంలో వినాయకచతుర్థి 33కు పైగా వివిధ ప్రదేశాల్లో వినాయక ప్రతిమలతో మండపాలను ఏర్పాటు చేశారు. వన్‌టౌన్, టూ టౌన్ సర్కిల్ సీఐ దివాకర్‌రెడ్డి, ఎస్సై లక్ష్మణరావు కమిటీ నిర్వాహకులకు పలు సూచనలు జారీ చేశారు.


మహానందిలో పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

వెలుగోడు: పట్టణంలో 35 విగ్రహాలు, గ్రామాలలో 20 గ్రహాలు ఏర్పాటు చేశారు. గణనాథులకు బుధవారం నిమజ్జనం నిమజ్జనం నిర్వహించినట్లు ఎస్ఐ వెంకట ప్రసాద్ తెలిపారు.

శ్రీశైలంప్రాజెక్ట్: వినాయకచవితి వేడుకలను శ్రీశైలం ప్రాజెక్ట్‌లో ఘనంగా నిర్వహిస్తున్నారు. సోమవారం సున్నిపెంటలోని 35 ప్రాంతాల్లో వినాయకుడి ప్రతిమలను ఏర్పాటు చేసి పూజలు చేస్తున్నారు.

మహానంది: మహానంది మండలంలోని 13 గ్రామ పంచాయతీలు, మజరా గ్రామాల్లో మొత్తం 68 విగ్రహాలను నెలకొల్పినట్లు మహానంది ఎస్ఐ నాగేంద్ర ప్రసాద్ తెలిపారు.

మహానందిలో పూజలు

మహానంది: వినాయకచవితి పర్వదినం సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రమైన మహానందిలో పూజలు వైభవంగా జరిగాయి. ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, ప్రధానార్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, పండితులు నాగేశ్వరశర్మ, హనుమంతశర్మలు పూజలను శాస్త్రోక్తంగా చేపట్టారు. ఆలయంలో కొలువైన గణపతిస్వామికి విశేష పూజలు, గంధం, పసుపు, కుంకుమ, వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకం చేశారు. అలాగే శ్రీ గంగా, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు పల్లకీసేవ వైభవంగా జరిగింది. సూపరింటెండెంట్ ఓంకారం వెంకటేశ్వరుడు, ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, ధర్మకర్తలు పాల్గొన్నారు.


పాములపాడులో మట్టి వినాయకుని విగ్రహం వద్ద జెడ్పీటీసీ జ్యోతి


కొత్తపల్లిలో పూజలు అందుకుంటున్న విఘ్నేషుడు


తాటిపాడులో పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా జనరల్ సెక్రెటరీ కోసిక తిరుమలేశ్వరరెడ్డి


శ్రీశైలం ప్రాజెక్ట్‌లో కొలువైన గణపతి


నందికొట్కూరు రాజావీధిలో ప్రత్యేక ఆకర్షణగా వ్యాస గణపతి


వీపనగండ్ల గ్రామంలో వెలసిన వినాయకుడు


మండపం వద్ద భక్తుల సందడి


పోతులపాడులో వినాయకునికి ప్రత్యేక పూజలు చేస్తున్న సర్పంచ్ పల్లెనిర్మలమ్మ, భక్తులు